

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 26-03-2025 | సంపుటి - 22 | సంచిక - 332 | రూ : 4 | పేజీలు: 8




## భూముల అమ్మకంతో హైదరాబాద్ పరిస్థితి సంక్లిష్టం

- ప్రకృతిని సంరక్షించాలి: ఎంపీ లక్ష్మణ్

దిల్లీ: ఒక వైపు వరదలు, మరోవైపు కాంక్రీట్ జంగిల్‌గా మారిన హైదరాబాద్‌లో ప్రకృతిని సంరక్షించడం వదిలేసి రాష్ట్ర ప్రభుత్వం ఉన్న భూములను కూడా అమ్మేస్తోందని భాజపా ఎంపీ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ఆయన మంగళవారం రాజ్యసభలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సవరణ బిల్లుపై జరిగిన చర్చలో మాట్లాడారు. ''హైదరాబాద్‌లో 1908 నుంచి అయిదేళ్ల క్రితం వరకు భారీ వరదలు వచ్చాయి. దానివల్ల వేలమంది ముంపునకు

తరువాయి 2లో

## కలెక్టర్లూ..
# అధికార దర్పం వద్దు

- అన్నింటికన్నా ప్రజలే మనకు ముందు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే మన ప్రభుత్వానికి మూలస్తంభాలు
- ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ.. లోపాల్లేకుండా నిర్వహించాలి
- మే నెలలో 'తల్లికి వందనం'
- అనకాపల్లి, రామాయపట్నంలో కొత్త టౌన్‌షిప్‌లు
- కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు

2లో







## తెలంగాణకు బీవైడీ!

- భారీ పెట్టుబడుల ప్రణాళిక
- హైదరాబాద్ సమీపంలో విద్యుత్తు కార్ల యూనిట్

తెలంగాణ రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు రాబోతోంది. చైనా విద్యుత్తు కార్ల దిగ్గజ సంస్థ బీవైడీ, హైదరాబాద్ సమీపంలో విద్యుత్తు కార్ల యూనిట్ స్థాపించేందుకు సిద్ధమవుతున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. దీనిపై ఈ సంస్థ కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు సాగిస్తూ.. ఇటీవల తుది నిర్ణయాన్ని తెలియజేసినట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమి

తరువాయి 2లో

## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం వెలికితీత




- అనుమానిత ప్రాంతాల కంటే ముందే గుర్తింపు
- మృతుడు యూపీకి చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్

అమ్రాబాద్ : శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగంలో మరో మృతదేహాన్ని వెలికితీశారు. ఫిబ్రవరి 22న జరిగిన సొరంగ ప్రమాదంలో 8 మంది కార్మికులు చిక్కుకున్న సంగతి తెలిసిందే. మార్చి 9న గురుప్రీత్‌సింగ్ మృతదేహాన్ని కనుగొన్నారు. దేశంలోనే నైపుణ్యం కలిగిన 12 సంస్థల బృందాలు సహాయక చర్యలు

తరువాయి 2లో



## ప్రసాదాలపై
# జీఎస్టీ మినహాయింపు

- నూతన ఐ.టి.బిల్లుపై వర్షా కాల సమావేశాల్లో చర్చ: నిర్మల
- ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి ప్రసాదాలను మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో వెల్లడించారు. ఆలయాలు, ప్రార్థన మందిరాల్లో విక్రయించే ప్రసాదా లకు ఈ పన్ను వర్తించబోదని స్పష్టంచేశారు. 2025 ఆర్థిక బిల్లుపై మంగళవారం లోక్‌సభలో జరిగిన చర్చకు ఆమె సమా ధానమిచ్చారు. నూతన ఆదాయపు పన్ను (ఐ.టి.) బిల్లుపై చర్చ పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో జరగనుందని తెలిపారు. ఐ.టి. బిల్లును ప్రస్తుతం పార్లమెంటు సెలెక్ట్ కమిటీ పరిశీలిస్తోందని, తదుపరి సమావేశాల తొలిరోజున అది తన నివేదికను

తరువాయి 2లో

## 30న..
# సాయంత్రం ఆరింటికి..

- సన్న బియ్యం పథకం ప్రారంభానికి ముహూర్తం ఖరారు
- హుజూర్‌నగర్ సభలో లాంఛనంగా పంపిణీ చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఏప్రిల్ 1 నుంచి అన్ని రేషన్ దుకాణాల్లో పంపిణీ



హైదరాబాద్: పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకం ముహూర్తం అధికారికంగా ఖరారైంది. ఉగాది పర్వదినమైన 30వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రం దీనికి వేదిక కానుంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు అక్కడ జరిగే బహిరంగ సభలో సన్న బియ్యం పంపిణీని సీఎం లాంఛనంగా ప్రారంభిస్తారు. ఇందుకోసం 20 మంది రేషన్ కార్డుదారుల్ని ప్రాథమికంగా గుర్తించారు. సుమారు 10 మందికి రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా సన్న బియ్యాన్ని అందిస్తారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తరువాయి 2లో



### ఉచిత వైద్యం నిరాకరిస్తే ఆసుపత్రిని
## ఎయిమ్స్‌కు అప్పగిస్తాం

* దిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్‌కు సుప్రీంకోర్టు హెచ్చరిక
* 15 ఎకరాల లీజు ఒప్పందం 2023లో ముగిశాక ఏం చర్యలు తీసుకున్నారు?
* కేంద్రం, దిల్లీ ప్రభుత్వాలను ప్రశ్నించిన ధర్మాసనం
* నాలుగు వారాలకు కేసు వాయిదా

2లో

## వివేకా హత్య కేసు నుంచి
# తప్పించుకునేందుకు అవినాష్‌రెడ్డి కుట్ర



- ఆయన ప్రోద్బలంతో కృష్ణారెడ్డి తప్పుడు ఫిర్యాదు
- సీబీఐని, వివేకా కుటుంబసభ్యులను భయపెట్టాలని చూశారు
- దర్యాప్తును నిర్వీర్యం చేసేందుకు కొత్త కథ అల్లారు
- సుప్రీంకోర్టులో అదనపు వివరాలు సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వం

అమరావతి: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తును నిర్వీర్యం చేసి, ఆ కేసు నుంచి తప్పించుకునేందుకు వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఎంవీ కృష్ణారెడ్డి.. సీబీఐ దర్యాప్తు అధికారి, వివేకా అల్లుడు, కుమార్తెపై తప్పుడు ఫిర్యాదు చేశారని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు నివేదించింది. సీబీఐ దర్యాప్తునకు భంగం

తరువాయి 2లో

## ఐటీ, అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో
# యువతకు నైపుణ్య శిక్షణ

- మంత్రి లోకేశ్ సమక్షంలో సిస్కోతో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం

2లో



# తెలంగాణకు బీవైడీ!

(మొదటిపేజీ తరువాయి)

కేటాయించడంతో పాటు, అన్ని రకాలుగా మద్దతు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఆ సంస్థకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

*** మూడు ప్రాంతాల పరిశీలన**

హైదరాబాద్ పరిసరాల్లో యూనిట్ ఏర్పాటుకు అనువైన మూడు ప్రదేశాలను బీవైడీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ మూడింటినీ ఆ సంస్థ ప్రతినిధులు పరిశీలిస్తున్నారు. ప్రదేశంపై తుది నిర్ణయానికి రాగానే, ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకునే అవకాశం ఉంది. ఇది కార్యరూపం దాల్చితే విద్యుత్తు కార్ల విభాగంలో అతిపెద్ద ప్రైవేటు రంగ ప్రాజెక్టును, భారీ పెట్టుబడిని దక్కించుకున్న ఘనత తెలంగాణ రాష్ట్రానికి దక్కుతుంది. దీంతో పాటు విద్యుత్తు కార్ల విడిభాగాలు ఉత్పత్తి చేసే అనుబంధ యూనిట్లూ దీనికి సమీపంలో ఏర్పాటయ్యే అవకాశాలుంటాయి. తద్వారా విద్యుత్తు వాహనాల క్లస్టర్ హైదరాబాద్ సమీపంలో రూపుదిద్దుకున్నట్లు అవుతుంది.

*** దేశంలో సంస్థకు తొలి యూనిట్ ఇదే**

బీవైడీ కొన్నేళ్లుగా భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్నా, ఇక్కడ సొంత యూనిట్లు లేవు. ప్రస్తుతం బీవైడీ విద్యుత్తు కార్లను చైనా నుంచి మనదేశానికి తీసుకువచ్చి విక్రయిస్తోంది. ఇందుకోసం అధిక దిగుమతి సుంకాలు చెల్లించాల్సి రావడంతో, ప్రస్తుతం ఈ కార్ల ధర ఎక్కువగా ఉంది. ఫలితంగా ఆశించిన రీతిలో అమ్మకాలు చేయలేకపోతోంది. విద్యుత్తు కార్లను మనదేశంలో ఉత్పత్తి చేస్తే ధర తగ్గుతుంది. తద్వారా అమ్మకాలు గణనీయంగా పెంచుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. మనదేశంలో సొంత యూనిట్ ఏర్పాటు చేసేందుకు రెండేళ్లుగా బీవైడీ కసరత్తు చేస్తోంది. కాకపోతే చైనా పెట్టుబడులను అనుమతించే విషయంలో కేంద్ర ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉండటంతో ఇప్పటివరకు సాధ్యం కాలేదు. తాజాగా కేంద్ర ప్రభుత్వం కొంత వెసులుబాటు కల్పించడంతో, బీవైడీ ప్రాజెక్టుకు మార్గం సుగమం అయినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా విద్యుత్తు బస్సుల కార్యకలాపాలు సాగిస్తున్న ఎంఈఐఎల్ గ్రూపు సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్‌తో ఎన్నో ఏళ్లుగా బీవైడీకి సాంకేతిక భాగస్వామ్యం ఉంది. బీవైడీ టెక్నాలజీతోనే విద్యుత్తు బస్సులను ఉత్పత్తి చేసి, దేశవ్యాప్తంగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సరఫరా చేస్తోంది. తన విద్యుత్తు కార్ల యూనిట్ ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రాన్ని బీవైడీ ఎంచుకోడానికి ఇదీ ఒక కారణమని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

*** బ్యాటరీ ప్లాంట్ కూడా**

మనదేశంలో కార్ల అసెంబ్లింగ్ ప్లాంటుతో పాటు 20 గిగావాట్ల బ్యాటరీ ప్లాంట్ ఏర్పాటు చేయాలనేది బీవైడీ ప్రణాళికగా ఉంది. అయిదు నుంచి ఏడేళ్లలో ఏటా 6 లక్షల విద్యుత్తు కార్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించే స్థాయికి తన కార్యకలాపాలను విస్తరించాలని ఈ సంస్థ భావిస్తోంది. ఇందుకోసం దశలవారీగా భారీ పెట్టుబడి పెట్టేందుకు బీవైడీ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కార్యకలాపాల్లో అమెరికా విద్యుత్తు కార్ల దిగ్గజం టెస్లాను బీవైడీ మించుతోంది. గతేడాది టెస్లా ఆదాయం 97.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8.40 లక్షల కోట్లు) అయితే, బీవైడీ ఆదాయం 107 బి. డాలర్లు/సుమారు రూ.9.20 లక్షల కోట్లు కావడం గమనార్హం. చైనా, ఐరోపా దేశాల్లో టెస్లా అమ్మకాలు తగ్గుతుంటే, బీవైడీ అమ్మకాలు పెరుగుతున్నాయి. కేవలం 5 నుంచి 8 నిమిషాల వ్యవధిలోనే విద్యుత్తు కార్ల బ్యాటరీని పూర్తిగా ఛార్జి చేయగలిగే 1 మెగావాట్ ఫ్లాష్ ఛార్జర్‌ను ఈ సంస్థ ఇటీవల విడుదల చేసింది. దీంతో ఒకసారి ఛార్జి చేసి 400 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయొచ్చు. విద్యుత్తు వాహనాల తీరుతెన్నులను ఈ టెక్నాలజీ సమూలంగా మార్చివేస్తుందని అంచనా వేస్తున్నారు.

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం వెలికితీత

(మొదటిపేజీ తరువాయి)

వద్ద సోమవారం అర్ధరాత్రి పొక్లెయిన్ సాయంతో మట్టిని తొలగిస్తుండగా దుర్వాసన రావడాన్ని బట్టి మరో మృతదేహం ఆనవాళ్లను గుర్తించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి సహాయక చర్యలు ప్రారంభించి మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో లోకో రైలులో మృతదేహాన్ని టన్నెల్ ముఖద్వారం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంతోష్ సమక్షంలో ప్రత్యేక అంబులెన్సులో నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడిని ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా గుర్తించినట్లు కలెక్టర్ ప్రకటించారు. మృతుడి స్వగ్రామం ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లా బాంగర్‌మవు. సొరంగ నిర్మాణసంస్థ జేపీ కంపెనీలో 2009 నుంచి పనిచేస్తున్నారు.



సొరంగంలో అనుమానిత ప్రదేశాలకు ముందుభాగంలోనే అతని మృతదేహాన్ని గుర్తించారు. టన్నెల్ పైకప్పు కూలినచోట 5 ప్రాంతాలను గుర్తించి తవ్వకాలు చేపడుతున్నారు. తర్వాత డీ1, డీ2 ప్రాంతాలపై దృష్టి సారించారు. ఈ నెల 9న డీ2 ప్రాంతంలో గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యమైంది. అదేక్రమంలో డీ1 దగ్గర, డీ2 పరిసరాల్లో అన్వేషణ సాగిస్తూ టన్నెల్ బోర్ మిషన్ (టీబీఎం) శకలాలను, మట్టి, శిథిలాలను తొలగించినా ఆచూకీ దొరకలేదు. టీబీఎంకు అనుసంధానంగా నడిచే లోకో ట్రైన్ వద్ద అనూహ్యంగా మనోజ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తించారు. డీ1, డీ2 ప్రాంతాలకు సుమారు 200 మీటర్ల ముందుభాగంలోనే లభ్యమవడం గమనార్హం. సొరంగంలో 13.65 కి.మీ. వద్ద మృతదేహం వెలికితీశారు. పోస్టుమార్టం అనంతరం.. రెవెన్యూ, వైద్య, పోలీసు శాఖల నుంచి ఒక్కొక్కరిని అంబులెన్సుతో పాటు పంపించి స్వగ్రామంలో మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని కలెక్టర్ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి చెక్కును వెంటవెళ్లే సిబ్బందికి అందజేశారు. మృతుడికి భార్య స్వర్ణలత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

**సహాయ చర్యలు ముమ్మరం..**

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సహాయ చర్యలను ముమ్మరం చేశామని.. ఏప్రిల్ 10 నాటికి మిగిలిన ఆరుగురి ఆచూకీని గుర్తించే అవకాశం ఉన్నట్లు సింగరేణి జనరల్ మేనేజర్ దేబులాల్ బైద్య పేర్కొన్నారు. కన్వేయర్ బెల్టు నుంచి 60 మీటర్ల వరకు ఇప్పటికే మట్టిని తొలగించామని, మరో 253 మీటర్ల వరకు మట్టిని తొలగిస్తే ఫలితం ఉంటుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా తదితర ఏజెన్సీల సిబ్బంది నిరంతరం సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# కలెక్టర్లూ.. అధికార దర్పం వద్దు

అమరావతి : జిల్లాల ప్రగతి బాధ్యత కలెక్టర్లదేనని.. ప్రజలే ముందు అనే భావనతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'రాష్ట్రపాలనపై ఒక ముఖ్యమంత్రి ఎలా ప్రగాఢ ముద్ర వేస్తారో.. అలాగే జిల్లా కలెక్టర్‌గా మీరు చేసే పనులతో వచ్చే ఇమేజ్ కూడా మీకు శాశ్వతంగా నిలిచిపోతుంది. మీ హయాంలో ఏం సాధించారనేదే ముఖ్యం. మేం కలెక్టర్లం, గది నుంచి బయటకు రాలేమనే అధికార దర్పం వద్దు. అన్నీ తెలుసనే అహం వస్తే.. నేర్చుకోవడం ఆగిపోతుంది' అని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం ప్రారంభమైన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు కీలకోపన్యాసం చేశారు. 'సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వానికి మూడు స్తంభాలు. విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిన పెట్టాలి. రూ.9.74 లక్షల కోట్ల అప్పులు, వాటికి వడ్డీలు కట్టాలి. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి. కలెక్టర్లు చేసే ప్రతి పనికి కొలమానం ఉంటుంది. ప్రజల సంతృప్తే దానికి ముఖ్యం. దీన్ని నిరంతరం సమీక్షిస్తున్నాం. 22 రకాల సేవలపై అభిప్రాయాలు సేకరిస్తున్నాం. అధికారుల్లో జవాబుదారీతనం తెస్తాం. మెరుగైన సేవలు అందేలా చూస్తాం.

*** అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాములను చేద్దాం**

అభివృద్ధిలో ప్రజల్ని భాగస్వాములుగా చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. వారి ఆదాయం పెరుగుతుంది.



అమరావతి రాజధానికి 29 వేల మంది రైతులు ముందుకొచ్చి 35 వేల ఎకరాలు ఇచ్చారు. వారికి అభివృద్ధి చేసిన స్థలాలిస్తున్నాం. ఆదాయం పెంచుతున్నాం. మిగిలిన భూముల అమ్మకం ద్వారా వచ్చే నిధులతో రహదారులు, ఇతర సౌకర్యాలు కల్పించి రాజధానిని అభివృద్ధి చేస్తున్నాం. అనకాపల్లి స్టీల్‌ప్లాంట్, రామాయపట్నం పోర్టుల్లోనూ ఇలాగే భూమి సమీకరించి, కొత్త టౌన్‌షిప్‌లు అభివృద్ధి చేస్తాం. అక్కడి ప్రజల ఆదాయం కూడా పెరుగుతుంది. భవిష్యత్తు అంతా క్వాంటం కంప్యూటింగ్‌దే. రాష్ట్రంలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేస్తాం. 2 లక్షల మంది ఏఐ నిపుణుల్ని తయారు చేస్తాం.

**కలెక్టర్లకు సూచనలు**

- భిక్ష ఇచ్చినట్లు కాకుండా.. పేదలకు సంక్షేమాన్ని గౌరవంగా అందించే బాధ్యతను తీసుకోవాలి.
- ఏప్రిల్‌లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తాం. పాఠశాలలు తెరిచే నాటికి కొత్త ఉపాధ్యాయులు బడుల్లో చేరేలా చూడాలి.
- 20 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేయాలి. అధిక సంఖ్యలో పెట్టించే బాధ్యత మీదే.
- 204 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. తరచూ వెళ్లి వాటిని పర్యవేక్షించాలి.
- ప్రజల ఆహారపు అలవాట్లు మారుతున్నాయి. అందుకు అనుగుణంగా పంటలు సాగయ్యేలా చూడాలి.
- రాష్ట్రంలో వడగాలులతో ఒక్కరూ మరణించడానికి వీల్లేదు. ఎక్కడా నీళ్లు అందట్లేదనే మాట రాకూడదు. మీదే బాధ్యత.
- జీఎస్టీపై దృష్టి పెట్టాలి. ఎగవేతకు అవకాశం లేకుండా కఠినంగా వ్యవహరించాలి.
- ప్రాజెక్టు కేంద్రానిదైనా, రాష్ట్రానిదైనా పూర్తి చేయించాల్సింది మీరే. జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు వేగంగా సాగాలి. ఎవరి జోక్యంతోనూ ఆగకూడదు.
- నేను నిర్వహించినన్ని కలెక్టర్ సదస్సులు మరే ముఖ్యమంత్రీ పెట్టి ఉండరు. కలిసి కూర్చుని చర్చించుకుంటే మంచి ఫలితాలు వస్తాయనేదే దీనికి కారణం. జిల్లా పురోగతి బాధ్యత కలెక్టర్, ఇన్‌ఛార్జి మంత్రులదే.
- వ్యవసాయశాఖలో సిబ్బంది ఎక్కువ..పని తక్కువ

ఒకప్పుడు వ్యవసాయశాఖలో పని ఎక్కువ ఉండేది. ఇప్పుడు ఉద్యాన, పశుసంవర్ధకం పెరిగాయి. కానీ వ్యవసాయశాఖలోనే సిబ్బంది ఎక్కువగా, పని లేకుండా ఉన్నారు. ఇలాంటివి పునస్సమీక్ష చేయాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో 6 నుంచి 8మంది సిబ్బంది ఉండేలా హేతుబద్ధీకరిస్తున్నాం.

*** ఒక చిన్న మార్పు.. మీరూ ప్రయత్నించొచ్చు**

గత ప్రభుత్వంలో అసెంబ్లీ అంటే.. బూతులు తిట్టుకోవడమే. వినలేక ప్రజలు టీవీలు కూడా కట్టేసే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక అర్థవంతమైన చర్చలు నిర్వహించాం. ప్రజాప్రతినిధులకు సాంస్కృతిక పోటీలు నిర్వహిద్దామని సభాపతి అయ్యన్నపాత్రుడు ఆలోచించారు. అందులో మంత్రులు, ఎమ్మెల్యేలు పోటాపోటీగా ఆడి, మంచి సందేశం ఇచ్చారు. మంత్రులు మనోహర్, అచ్చెన్నాయుడు తదితరులు ప్రతిభ చూపారు. ఇలాంటివి మీరూ ప్రయత్నించొచ్చు' అని చంద్రబాబు పేర్కొన్నారు.

## ఐటీ, అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో యువతకు నైపుణ్య శిక్షణ

అమరావతి: రాష్ట్రంలో డిగ్రీ, ఇంజినీరింగ్, వృత్తి విద్య కోర్సులు చదువుతున్న విద్యార్థుల్లో ఐటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించేందుకు సిస్కో సంస్థతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఆ సంస్థల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు. దీని ప్రకారం.. విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలు పెంచేందుకు నెట్ వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధ (ఏఐ)లాంటి విభాగాల్లో సిస్కో సంస్థ అత్యాధునిక కంటెంట్‌ను అందిస్తుంది. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలు పెంపొందిస్తుంది. విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. కోర్సుల జాబితాను ఉన్నత విద్యాశాఖ ఖరారు చేస్తుంది. 50 వేల మంది యువతకు శిక్షణ ఇస్తారు. సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కార్యక్రమాలు కొనసాగుతాయి. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ కార్యదర్శి కోన శశిధర్, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేశ్ కుమార్, సిస్కో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దేడ్రిచ్, గవర్నమెంట్ ఆపరేషన్స్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్ పాల్గొన్నారు.

# 30న సాయంత్రం ఆరింటికి..

(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు.

**2.82 కోట్ల మందికి ప్రయోజనం**

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు పంపిణీకి నెలకు 1.701.80 లక్షల టన్నుల బియ్యం అవసరం. ఇప్పటివరకు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. వాటి స్థానంలో సన్నబియ్యం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 8 లక్షల టన్నుల సన్న బియ్యం సిద్ధంగా ఉంది. ఇది నాలుగైదు నెలలకు సరిపోతుంది. ప్రస్తుతం మిల్లింగ్ అవుతున్న ధాన్యంతో మరో నాలుగు నెలలకు సరిపడా బియ్యం వస్తుందని పౌరసరఫరాల శాఖ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 91,19,466 రేషన్‌కార్డులు ఉన్నాయి. సన్న బియ్యం పంపిణీతో 2.82 కోట్ల మందికి ప్రయోజనం కలగనుంది. ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున అందిస్తారు. నెలకు అవసరమైన బియ్యంలో 50 శాతం ఇప్పటికే రేషన్ దుకాణాలకు చేరిందని పౌరసరఫరాలశాఖ వర్గాలు తెలిపాయి. మిగిలింది రెండు, మూడు రోజుల్లో చేరనున్నట్లు సమాచారం.

# భూముల అమ్మకంతో హైదరాబాద్ పరిస్థితి సంక్లిష్టం

(మొదటిపేజీ తరువాయి)

గురయ్యారు. ఎంతోమంది చనిపోయారు. ఎప్పుడు వరదలు వచ్చినా ప్రజలు ముంపునకు గురవాల్సి వస్తోంది. ఎన్నికల్లో ఎన్నో వాగ్దానాలు ఇచ్చి వచ్చిన ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి కేటాయించిన 2003 ఎకరాల్లో 400 ఎకరాలను వేలం వేయడానికి నిర్ణయించింది. ఇది అటవీభూమి. రాష్ట్రం రూ.8లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నందున హామీల అమలుకు భూమిని అమ్మక తప్పడం లేదని ముఖ్యమంత్రి చెబుతున్నారు. ఇలాంటి చర్యల వల్ల హైదరాబాద్ పరిస్థితి సంక్లిష్టంగా మారుతోంది'' అని లక్ష్మణ్ పేర్కొన్నారు.

# వివేకా హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు అవినాష్‌రెడ్డి కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

కలిగించడం, ట్రయల్ కోర్టులో వాదనలు వినిపించేందుకు కట్టుకథ అల్లడం, అవినాష్‌రెడ్డితో పాటు ఇతర నిందితులను రక్షించేందుకు, సీబీఐ అధికారులను, వివేకా కుటుంబసభ్యులను బెదిరించడం కోసం కృష్ణారెడ్డి ఈ పని చేశారని స్పష్టం చేసింది. వివేకా హత్య కేసులో ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు కొందరు పోలీసు అధికారులతో కలిసి అవినాష్‌రెడ్డి కుట్ర పన్ని సీబీఐ, వివేకా కుటుంబసభ్యులపై తప్పుడు కేసు పెట్టించారని పేర్కొంది. ఈ కేసును మొదట దర్యాప్తు చేసిన సీఐ జి.రాజు వాంగ్మూలం, సాంకేతిక వివరాలు, పులివెందుల స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తే అవినాష్‌రెడ్డి మార్గదర్శకత్వంలో అప్పటి విశ్రాంత అదనపు ఎస్పీ రాజేశ్వరరెడ్డి, ఏఎస్సై రామకృష్ణారెడ్డి కేసును ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించారని పేర్కొంది. కేసు దర్యాప్తును రాజు చేయలేదని, దర్యాప్తు మొత్తం రాజేశ్వరరెడ్డి ప్రమేయంతో ఏఎస్సై రామకృష్ణారెడ్డి నివాసంలో జరిగిందని తెలిపింది. సాక్షులను ఏఎస్సై నివాసంలోనే విచారించి, తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేశారని వెల్లడించింది. సీబీఐ అప్పటి ఎస్పీ రాంసింగ్, వివేకా కుమార్తె, అల్లుడిపై చేసిన ఆరోపణలకు కృష్ణారెడ్డి ఎలాంటి ఆధారాలను చూపలేదంది. ట్రయల్ కోర్టులో తమకు రక్షణగా ఉపయోగపడేలా కథనాన్ని అల్లారంది. దీని ఆధారంగా నమోదు చేసిన కేసు అబద్ధమని తేల్చిచెప్పింది. ఈ వివరాలతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంలో అప్లికేషన్ దాఖలు చేసింది. వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డి, తదితర రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నట్లు వాంగ్మూలం ఇవ్వాలని సీబీఐ ఎస్పీ రాంసింగ్ తనను హింసించారని, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి కూడా తనను ఒత్తిడి చేస్తున్నారంటూ పులివెందుల కోర్టులో వివేకానందరెడ్డి పీఏ ఎంవీ కృష్ణారెడ్డి ప్రైవేటు ఫిర్యాదు వేశారు. కోర్టు ఆదేశాల మేరకు పులివెందుల పోలీసులు రాంసింగ్, సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని వారు హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం నిరాకరించింది. గతేడాది మే 10న హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సునీత, రాజశేఖరరెడ్డి సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. సుప్రీంకోర్టు.. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ కేసు దర్యాప్తులో చోటుచేసుకున్న పరిణామాలు, ఫిర్యాదు వెనుక ఉన్న దురుద్దేశాలను పేర్కొంటూ పులివెందుల డీఎస్పీ బుక్కె మురళి పులివెందుల కోర్టులో తాజాగా దాఖలు చేసిన తుది నివేదికలోని వివరాలను కోర్టు ముందుంచేందుకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్లికేషన్ దాఖలు చేసింది. ఆ నివేదికలోని కీలకాంశాలను కోర్టు దృష్టికి తెచ్చింది.

# ప్రసాదాలపై జీఎస్టీ మినహాయింపు

(మొదటిపేజీ తరువాయి)

సమర్పించాల్సి ఉందని చెప్పారు. అందువల్ల దానిపై చర్చ వర్షాకాల సమావేశాల్లోనే ఉంటుందన్నారు. ప్రస్తుత చట్టంలోని అధ్యాయాలు, సెక్షన్లను తగ్గించింది. ప్రభుత్వం ప్రతిపాదించిన 35 సవరణలతో 2025 ఆర్థిక బిల్లును లోక్‌సభ ఆమోదించింది. ఆన్‌లైన్ ప్రకటనలపై 6% డిజిటల్ పన్నును రద్దు చేయడం వంటి సవరణలు దీనిలో ఉన్నాయి. ఆర్థిక బిల్లును రాజ్యసభ పరిశీలించి, ఆమోదించిన తర్వాత 202526 బడ్జెట్ ప్రక్రియ పూర్తయినట్లు అవుతుంది.

# పేదలకు ఉచిత వైద్యం నిరాకరిస్తే ఆసుపత్రిని ఎయిమ్స్‌కు అప్పగిస్తాం

దిల్లీ: ప్రభుత్వంతో కుదిరిన లీజు ఒప్పందం ప్రకారం ఆసుపత్రికి వచ్చే రోగుల్లో మూడింట ఒక వంతు మందికి, ఔట్ పేషెంట్ రోగుల్లో 40శాతం మందికి ఉచిత వైద్యం అందించాల్సిన బాధ్యత దిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్‌కు ఉందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పేదలకు ఉచిత వైద్యాన్ని నిరాకరిస్తే ఆసుపత్రిని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)కు అప్పగిస్తామని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం మంగళవారం హెచ్చరించింది. దిల్లీలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో 15 ఎకరాల భూమిని ప్రభుత్వం నుంచి నామమాత్రపు లీజుకు తీసుకుంటూ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించాల్సి ఉన్నా దానిని ఉల్లంఘిస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. లాభ, నష్ట రహిత విధానంలో నడపాల్సిన ఆసుపత్రిని పూర్తిగా వ్యాపార సంస్థగా మార్చేశారని, ఇక్కడ పేదలకు వైద్యం అందుకోలేనంత ఖరీదైన వ్యవహారంగా మారిందని ఆక్షేపించింది. అపోలో హాస్పిటల్ నిర్వహణ సంస్థ... ఇంద్రప్రస్థ మెడికల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఎంసీఎల్) తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ....ఈ ఆసుపత్రిలో దిల్లీ ప్రభుత్వం కూడా భాగస్వామి అని, దానికి 26శాతం వాటా ఉందని తెలిపారు. ఆ మేరకు ప్రభుత్వానికి ఆదాయంలో వాటా వెళ్తోందని వెల్లడించారు. 'పేద రోగుల సంరక్షణను పట్టించుకోకుండా దిల్లీ ప్రభుత్వం ఆదాయం పొందుతున్నట్లయితే అది అత్యంత దురదృష్టకరమ'ని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వంతో చేసుకున్న 30ఏళ్ల లీజు ఒప్పందం 2023తో ముగిసిందని, ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించారా లేదా అన్న విషయాన్ని కేంద్రం, దిల్లీ ప్రభుత్వం ధర్మాసనానికి తెలియజేయాలని ఆదేశించారు.

# కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణం

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం**

మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. మంగళవారం కూకట్ పల్లి మండలంలోని బృందావన్ కాలనీలో కుత్బుల్లాపూర్ కు నిర్వహిస్తున్న తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జూనియర్ కాలేజీని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తనిఖీ చేసారు.ఈ సందర్భంగా కలెక్టరు పదవ తరగతిలోని ప్రతి విద్యార్థితో కలెక్టరు ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏ గ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్తు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇదే స్ఫూర్తితో చదువుకోవాలని విద్యార్థులకు బోధించారు. కష్టపడి చదివి





మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. భోజన శాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్ కు సూచించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రంజాన్ మాసం ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్న విద్యార్థులకు బలవర్థకమైన పౌష్టికాహారాన్ని అందించాలని కలెక్టరు సూచించారు. స్టోర్ రూం లోని వంట సామాగ్రిని పరిశీలించి తడి తగలకుండా నిలువ చేయాలన్నారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ మార్కులను సాధించే విద్యార్థులకు భవిష్యత్తులో చదువుకునే కోర్సులపై మార్గదర్శకం అందిస్తూ వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ను అందుబాటులో ఉంచాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. పాఠశాల భవనానికి చెల్లించే అద్దెలో 5 శాతం మినహాయించి అవసరమైన చిన్న చిన్న మరమ్మత్తులను చేయించుకోవాలని ప్రిన్సిపల్ కు సూచించారు. అనంతరం ప్రక్కనే నిర్వహిస్తున్న బాలానగర్ తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జూనియర్ కాలేజీని కూడా కలెక్టరు సందర్శించారు. అక్కడ కూడా విద్యార్థులతో మాట్లాడి వారికి మిగిలిన పరీక్షలు కూడా బాగా వ్రాయాలని మంచి మార్కులు సాధించాలని కలెక్టరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈఓ కాంతమ్మ, కూకట్ పల్లి తహసీల్దారు స్వామి, కాలేజీ ప్రిన్సిపల్ మాధవిలత, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో ధర్మోజిగూడెం లో బోరు

- **సమృద్ధిగా వచ్చిన నీరు**
- **ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: వేసవి దృష్ట్యా మండలంలోని ధర్మోజిగూడెం గ్రామంలో ప్రజలు నీటి కష్టాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విషయం గుర్తించిన ధర్మోజిగూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన నిధులతో ధర్మోజిగూడెం గ్రామంలో మంగళవారం బోరు వేయించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారానికి దేవుడి వరంలా నీరు సమృద్ధిగా పడింది. ప్రజల నీటి కష్టాలను తీర్చడం కోసం బోరు వేయించడం పట్ల గ్రామ ప్రజలందరూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లబోతు నారాయణ, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, గ్రామ కాంగ్రెస్ ఎన్నికల ఇంచార్జ్ కొయ్యడ సైదులు గౌడ్, మాజీ ఉప సర్పంచ్ లు కొంతం బుచ్చిరెడ్డి, కొంతం రామకృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఊదరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి ఐతరాజు లింగస్వామి, ఊదరి లింగయ్య, ఊదరి భీమయ్య, సామిడి లింగారెడ్డి, చెన్నోజు విజయాచారి, ఎంగలి భీమ్ రెడ్డి, వల్లబోతు లింగయ్య, ఐత రాజు బాలయ్య, పిసాటి బాల్ రెడ్డి, దాసరి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా , అందించిన ఘనత బిఆర్ఎస్ దే

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు




(ప్రజాస్ఫూర్తి, శేరిలింగంపల్లి) : శేర్లింగంపల్లి నియోజకవర్గం లోని ఆల్విన్ కాలనీ డివిజన్ లో ఎర్రబెల్లి సతీష్ రావు ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున ముస్లిం మైనార్టీలు హాజరయ్యారు. కూకట్ పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్ ముస్లిం మైనారిటీల పవిత్ర పండుగ అయిన రంజాన్ కు తోఫా అందివ్వకుండా కనీసం తాగడానికి నీళ్లు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీలకు పండగలకు బట్టలను పంపిణీ చేసి ఇమాములకు పదివేల రూపాయలు అందించి వారికి దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కనబడుతుంది కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పై దృష్టి పట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు.




## జర్నలిస్టులకు అండగా ఉంటాం

* **జర్నలిస్టుల ఇండ్ల స్థలం న్యాయమైన డిమాండ్**
* **వంటా వార్పు విజయవంతం**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జర్నలిస్టుల న్యాయమైన కోరికను ప్రభుత్వం నెరవేర్చాలని, వారికి ఇండ్ల స్థలం ఇచ్చేదాక అండగా ఉంటామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ పార్టీ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని నాగేశ్వర్ రావు, జై భీం రావ్ భారత్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర కామేష్ లు హామీ ఇచ్చారు. కార్పోరేట్ కంపెనీలకు నామమాత్రపు రేట్ కే ఎకరలకేకరాలు అప్పగిస్తూ , నిత్యం ప్రజా సంక్షేమం కోసం, పీడిత ప్రజల కోసం పని చేస్తూ చాలిచాలని వేతనం తో బ్రతుకులీడుస్తున్న జర్నలిస్టులు ఇండ్ల స్థలం కోసం కోట్ల రూపాయలు చెల్లించాలని ప్రభుత్వం చెప్పడం దుర్మార్గమని అన్నారు. ఇండ్ల స్థలాలు సాధించడమే ధ్యేయంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన జర్నలిస్టులు ఎప్పుడు ఏ పిలుపునిచ్చిన తమంత వెంట నిలుస్తామని ముక్త కంఠంతో స్పష్టం చేశారు. నిరుపేదలైన జర్నలిస్టులు 200గజాల స్థలం కోసం కోట్ల రూపాయలు ఎలా చెల్లిస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్పోరేట్ సంస్థలకు ఉచితంగా ఇస్తూ , సమాజ బాగు కోసం అనునిత్యం పని చేస్తున్న వారికి ఉచితంగా కాకుండా కోట్ల రూపాయలు చెల్లించాలనడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి వెంటనే గతంలో ఇచ్చిన జీ వో ను రద్దు చేసి నామ మాత్రపు రేట్ కి ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ, అడ్వకేట్ లు మరపాక రమేష్, హరి, సంకుబాపన అనుదీప్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

**అమరవీరులకు నివాళి**

జర్నలిస్టు ల ఇండ్ల స్థలాల సాధన నిరసన కార్యక్రమంలో భాగంగా 6వ రోజు స్థానిక బస్టాండ్ సెంటర్లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వంట వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల ప్రతినిధులు, స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు పాల్గొన్నారు.

## అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

* **ఏఏఎస్ భద్రాద్రి జిల్లా ఇంచార్జ్ బొడికల ప్రేమ దయాళ్**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: . కార్మికులకు, ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా, పారదర్శకత లోపించే విధంగా బాధ్యత రాహిత్యగా సింగరేణి అధికారుల వ్యవహార శైలిపై ఏఏఎస్ భద్రాద్రి జిల్లా ఇంచార్జ్ బొడికల ప్రేమ దయాళ్ అసహనం వ్యక్తం చేశారు. సింగరేణి పలు ప్రభుత్వ శాఖలలో సమాచార హక్కు చట్టం అమలు విషయంలో అధికారులు అవలంభిస్తున్న తీరుపై సమాచార హక్కు సాధన స్రవంతి సంస్థ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బండ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆజాద్ అదికార్ సేన పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇంచార్జ్, ఆర్టీఐ ఆక్టివిస్ట్ బోడికల ప్రేమ దయాళ్ సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థలో నెలకొన్న అవినీతి, అక్రమాలపై అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పౌర సమాచార అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు పలు సమస్యల పరిష్కారం దిశగా బొడికల ప్రేమ్ దయాళ్ గళం విప్పారు. అధికారులు ఇష్టరీతిగా ఒక విభాగానికి సంబంధించిన సమాచారన్ని కోరగా పూర్తి స్థాయిలో దరఖాస్తులను పరిశీలించకుండా మరొక విభాగానికి పంపి సమాచారం దాచి పెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పలు కీలక శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వకపోవడం వెనక అనేక అనుమానాలకు తావిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పబ్లిక్ డొమైన్ లో ఉండాల్సిన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచకుండా, సెక్షన్ 8(1)జే, సెక్షన్ 7(1) చూపుతూ సమాచారాన్ని దాటవేసే ధోరణిలో ప్రజా సమాచార అధికారులు వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. అధికారుల తీరు మార్చుకోక పోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు. ఇక నైనా అధికారులు తమ తీరు మార్చుకోవాలని సూచించారు. సింగరేణి అధికారుల తీరుపై సంస్థ సిఎండీ బలరాం ను కలిసి వివరిస్తానని తెలిపారు. ప్రభుత్వ శాఖలలో ప్రజా సమాచార అధికారుల తీరుపై జిల్లా కలెక్టర్ కు తెలియజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసాలు మురళీ మోహన్, గండ్ర జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన వరద రాజయ్య అనే రైతు గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. రాజయ్య మరణంతో ఆయన భార్య పద్మ ఒంటరి అయ్యింది. నిరుపేద కుటుంబం కావడంతో దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆమెను ఆదుకోవాలని సోషల్ మీడియాలో దాతలను గజ్జల రాజు కోరగా, పలువురు ముందుకు వచ్చి 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్ రెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, కొండం రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలుముల రామిరెడ్డి, యూత్ నాయకుడు రంజాన్ నరేష్, దుబ్బాక రాజు, కొండల్ రెడ్డి, ఎద్దండి మహేందర్, అనమేని రాజు తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలి

* **తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. తెలంగాణ బడ్జెట్ 2025 26 సమావేశాల్లో భాగంగా మంగళవారం కుత్బుల్లాపూర్ లో డిగ్రీ కళాశాలకు స్థల కేటాయింపు, నిర్మాణ విషయంపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023 లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుత్బుల్లాపూర్ లో డిగ్రీ కళాశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వ స్థలం కేటాయించకపోవడంతో బహదూర్ పల్లి లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ స్థలంలోనే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో ఇటు డిగ్రీ విద్యార్థులకు, అటు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించే విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే హెచ్ఎండిఏ పరిధిలోని 110 ఎకరాలలోని హెచ్ఎంటి స్థలంలో ఐదు ఎకరాలను కేటాయించినట్లయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు, సిఎస్ఆర్ ఫండ్స్ లలో వేటినైన వినియోగించి కళాశాల నిర్మాణాన్ని చేపట్టవచ్చునన్నారు. ఈ కళాశాల ఏర్పాటుతోనైనా విద్యార్థులకు న్యాయం చేసిన వారమవుతామన్నారు.

## సబ్సిడీపై మహిళా రైతులకు వ్యవసాయ పనిముట్లు

* **మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లను మహిళా రైతులకు సబ్సిడీపై అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు చౌటుప్పల్ మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చౌటుప్పల్ మండలానికి 5బ్యాటరీ స్ప్రేయర్లు,5 పవర్ స్ప్రేయర్లు, 3రోట వేటర్స్, 2డిస్క్ హారో,1విత్తన, ఎరువులు వేసుకొనే యంత్రం 1బ్రష్ కట్టర్, 1పవర్ టిల్లర్ ను 40శాతం సబ్సిడీ మీద మంజూరు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. కావున ఆసక్తి గల వారు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తు ఫారంతో పాటు పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు జీరాక్స్ జతపరిచి మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అందచేయాలని పేర్కొన్నారు.

# రాముడు నడయాడిన భద్రాద్రి కి కొత్త శోభ







* దక్షిణ అయోధ్య భద్రాద్రి అభివృద్ధికి అడుగులు
* టెంపుల్ సిటీగా భద్రాద్రి రామాలయం
* భూ సేకరణకు కాంగ్రెస్ సర్కారు గ్రీన్ సిగ్నల్
* మంత్రి తుమ్మల ప్రత్యేక చొరవతో సీఎం అంగీకారం
* భూసేకరణకు 34 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
* సీఎం రేవంత్ కు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి రామయ్య ఆలయం నూతన శోభ సంతరించుకోనుంది. శ్రీరామనవమి సీతారామ కళ్యాణం నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో కాంగ్రెస్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి రామయ్య ఆలయ అభివృద్ధికి పూనుకుంది. భద్రాద్రి రామయ్య అభివృద్ధి పనులకు ఆటంకంగా ఉన్న భూ సేకరణకు కాంగ్రెస్ సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భద్రాద్రి ఆలయ భూ సేకరణ సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రి కి దృష్టికి తీసుకు వెళ్లగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యుద్ధ ప్రాతిపదికన భూ సేకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూ 34 కోట్లు నిధులను విరుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రామ నవమి కి దక్షిణ అయోధ్య టెంపుల్ సిటీకి అడుగులు పడనున్నాయి.

### అడిగిందే తడవుగా ....

ఆదివారం రోజున ఆలయ ఈవో , పండితులు గౌరవ ముఖ్య మంత్రి ని కలిసి భద్రాచల సీతారామచంద్రస్వామి శ్రీరామనవమి వేడుకలకు ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల గతంలో భద్రాద్రి ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ ను సీఎంకు వివరించారు. అభివృద్ధి పనులకు భూ సేకరణ అడ్డంకిగా మారిందని తుమ్మల సీఎంకు వివరించారు. భూ సేకరణ పనులు పూర్తి చేస్తే భద్రాద్రి ఆలయ అభివృద్ధికి ఎలాంటి ఆటంకం ఉండదని భద్రాద్రి ఆలయం భక్తులతో మరింత శోభిల్లుతోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. మంత్రి తుమ్మల చొరవతో సీఎం రేవంత్ రెడ్డి భూ సేకరణకు కావలసిన నిధులను మరుసటి రోజు విడుదల చేసి ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. భద్రాద్రి ఆలయ అభివృద్ధికి నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

### నవ భద్రాద్రి...

భారతదేశానికి తలమానికంగా దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. అనేక ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న భూ సేకరణ సమస్యకు ఎట్టకేలకు మంత్రి తుమ్మల పరిష్కారం చూపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నవ భద్రాద్రి దిశగా తుమ్మల కృషి చేస్తున్నారు. భూ సేకరణ తరువాయి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. దక్షిణ అయోధ్యగా భద్రాద్రి ఆలయ కీర్తి ధ్వనించేలా అభివృద్ధి చేయనున్నారు.

### నమూనాలు సిద్ధం...

శ్రీరామచంద్రుడి ఆలయ అభివృద్ధికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యవేక్షణలో భద్రాద్రి ఆలయం నూతన శోభ సంతరించుకొనుంది. ఆగమ పండితులు రూపొందించిన నమూనాలు మరియు సూచనల ప్రకారం అభివృద్ధి పనులను ప్రారంభించాలి అని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. శరవేగంగా భూ సేకరణ పనులు పూర్తిచేయాలని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన షాపులు, ఇల్లు షిఫ్టింగ్ చేసేలా ఆదేశాలు జారీ చేశారు. శ్రీరామనవమి వేడుకలు అనంతరం నమూనాల ప్రకారం అత్యద్భుతంగా భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా భద్రాద్రి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీనితో రాష్ట్ర ప్రజల కల సాకారం కానుంది

## న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా చౌటుప్పల్ కోర్టు ఎదుట ధర్నా




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రంగారెడ్డి జిల్లా కోర్టు సీనియర్ న్యాయవాది ఇజ్రాయిల్ హత్యకు నిరసనగా చౌటుప్పల్ కోర్టు ముందు చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు ధర్నా నిర్వహించారు. కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రోజురోజుకీ న్యాయవాదుల మీద దాడులు హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా న్యాయవాది ఇజ్రాయిల్ మృతికి కారణమైన దస్తగిరిని వెంటనే శిక్షించాలని కోరారు. కొయ్యలగూడెం వాస్తవ్యులు న్యాయవాది గడ్డం యాదగిరి గుండెపోటుతో అకాల మరణం చెందడం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాపోలు వేణు, ఉపాధ్యక్షులు తాడూరి పరమేష్, సహాయ కార్యదర్శి జల్లా రమేష్, కమిటీ సభ్యులు జక్కర్తి శేఖర్, ఆల్లి స్వాతి, సీనియర్ న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, ఎస్ఆర్ బిక్షపతి, బాల్యం వెంకట చలపతి, రాధాకృష్ణ, వాకిటి నరసింహారెడ్డి, చామట్ల జంగయ్య, పాల పరమేష్, గంగదేవి రవీందర్, కానుగు వెంకటయ్య, ఎండి ఖయ్యాం పాషా, దేశగోని శ్రీశైలం, మేడి సత్యనారాయణ, గర్దాసు రాఘవేంద్ర, పిట్టల భరత్ చంద్ర, ఎ.శంకర్, శ్రీకాంత్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు



శేరిలింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ అక్రమ నిర్మాణాలకు అడ్డగా మారింది. 10లో సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్న జిహెచ్ఎంసి అధికారులు మాత్రం నిమ్మకునీనెక్కినట్టు వ్యవహరిస్తున్నారు. మైత్రి నగర్, మియాపూర్, లక్ష్మీ నగర్, కాలనీ న్యూ కాలనీ, మయూరి నగర్, బి కే ఎంక్లేవ్ రెడ్డి కాలనీ ,నాగార్జున కాలనీలలో అక్రమ నిర్మాణాలు యదేచ్చగా జరుగుతున్న అధికారులు మాత్రం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల అక్రమ సెల్లార్లు సైతం తీసి నిర్మాణాలు చేపడుతున్న జిహెచ్ఎంసి సిబ్బంది ఎందుకు పట్టించుకోవడం లేదు అర్థం కావడం లేదంటూ స్థానికులు వాపోతున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు దృష్టి పెట్టే అధికారులు ముందు జాగ్రత్తగా ఫిర్యాదులు వచ్చిన ఎందుకు పట్టించుకోవడం లేదంటూ నిలదీస్తున్నాం. ఈ నిర్మాణాలపై జిహెచ్ఎంసికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటూ హైడ్రాన్ ఆశ్రయించినట్లు తెలుస్తోంది. మరోవైపు జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు ప్యాకేజ్ మాట్లాడుకొని మరి నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. అందుకే టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదని తెలుస్తోంది. ఏది ఏమైనా మియాపూర్ డివిజన్ లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.

## టీవిఆర్ మోడల్ హై స్కూల్ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్నగర్ డివిజన్ పరిధిలోని అపురూపకాలనీలో గల టీవిఆర్ మోడల్ హై స్కూల్ లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీవిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులతో జ్యోతి ప్రజ్వలన చేసి వెల్ కం డ్యాన్స్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అ నంతరం ప్రీ ప్రైమరీ విద్యార్థులు యుకేజీ పూర్తి చేసుకుని ప్రైమరీ సెక్షన్ 1వ తరగతిలోకి అడుగుతున్న శుభ సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రమోట్ చేసిన పత్రాలను సర్టిఫికెట్లను విద్యార్థులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పి వాటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో సబ్జెక్ట్ బేసిడ్ లేర్న్ విధానంతో విద్యార్థుల నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఒకటో తరగతికి ప్రమోట్ అయ్యేలా నూతన విద్యా విధానంతో మదర్ టీచర్స్ ద్వారా విద్యాబోధన అందించడం టీవిఆర్ హై స్కూల్ ప్రత్యేకత అని అన్నారు. టీచర్స్ తీసుకుంటున్న శ్రద్ధ, తల్లిదండ్రులను మరిచే విధంగా ఆప్యాయంగా విద్యను బోధిస్తున్న టీచర్స్ ని యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. తమ చిన్నారుల స్పీచెస్, పాట పాడిన విధానం, చక్కటి డాన్స్ లను చూసి ఆనందంతో తల్లిదండ్రులు పొంగిపోయారు. ఈ కార్యక్రమంలో ఎల్ కెజీ, పట్టభద్రులు యుకెజీ విద్యార్థిని విద్యార్థులు, ప్రిన్సిపల్ ఎం. జయరాజ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఇంటి పెద్ద మరణంతో దిక్కుతోచని స్థితిలో కుటుంబం

* దాతలు ముందుకు వచ్చి సహాయం అందించండి
* ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయం





ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన అన్నవేని సత్యం అకాల మరణంతో ఇంటి పెద్దను కొల్పోయి దిక్కుతోచని స్థితిలో ఆయన కుటుంబం బిక్కుబిక్కుమంటుంది. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితి ఆ కుటుంబంది. కుటుంబాన్ని పోషించే ఇంటి పెద్ద మరణంతో అతని కుటుంబం నిస్సహాయ స్థితిలో ఉంది. అతనికి భార్య స్రవంతి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాయ కష్టం చేసి పిల్లలను చదివించుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఇంటి పెద్ద మరణించడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న అతని భార్య దాతల సహాయం కోసం ఎదురుచూస్తుంది. బాధిత కుటుంబానికి మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. కాగా బాధిత కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి సహాయం అందించాలని కోరారు. సహాయం చేయదలచిన వారు ఫోన్ పే, గూగుల్ పే నెంబర్ 9963865143కు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పిట్ల రాంగోపాల్, ప్రధాన కార్యదర్శి పిట్ల విట్టల్, మాజీ ఎంపిటిసి గజ్జల రాజు, గొడుగు శంకర్, జాల బిక్షపతి, శ్రీకాంత్, నర్సింలు, రాజమల్లయ్య, విద్యాధర్, బిక్షపతి, నరసయ్య తదితరులున్నారు.

## రువులను పరిశీలించిన హైడ్రా కమిషనర్...

* కొత్తకుంట చెరువులో మట్టి నింపిన బిల్డర్లపై ఆగ్రహం
* కొత్తకుంట చెరువు, తమ్మిడికుంట, సున్నం చెరువులను పరిశీలించిన రంగనాథ్
* కొత్తకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపుతున్న వంశీరామ్ బిల్డర్స్‌పై ఆగ్రహం
* మూడ్రోజుల్లో మట్టిని తొలగించాలని ఆదేశం



హైడ్రా కమిషనర్ రంగనాథ్ హైదరాబాద్ నగరంలోని పలు చెరువులను పరిశీలించారు. ఖాజాగూడలోని కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌ను మట్టితో నింపుతున్న వంశీరామ్ బిల్డర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తకుంట ఎఫ్‌టీఎల్‌లో మట్టిని మూడు రోజుల్లో తొలగించాలని బిల్డర్లను హెచ్చరించారు. మట్టిని తొలగిస్తామని వంశీరామ్ బిల్డర్లు కూడా తెలిపారు. కొత్తకుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితిని కమిషనర్ పరిశీలించారు. ఇదే విషయమై ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కూడా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని తెలుసుకోవడానికి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేయాలని అన్నారు. ఆ తర్వాత మాదాపూర్‌లోని తమ్మిడికుంట, బోరబండ సమీపంలోని సున్నం చెరువును సందర్శించారు. ఈ రెండు చెరువుల్లో పూడికతీత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. చెరువుల చుట్టూ తిరిగి, సుందరీకరణ, పచ్చదనం పెంచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. హైడ్రా ఈ ఏడాది చేపట్టిన ఆరు చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి, సుందరీకరణ పనులు వచ్చే వర్షాకాలానికి పూర్తి కావాలని, పనుల్లో ఎక్కడా జాప్యం, అలసత్వం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## డిజిటల్ అరెస్టుల కట్టడికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది : బండి సంజయ్



డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారి ఆట కట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం నడుం బిగించింది. ఈ మేరకు తీసుకున్న చర్యల్లో భాగంగా ఫిబ్రవరి 7.81 లక్షల సిమ్ కార్డులను, 83 వేల వాట్సాప్ ఖాతాలను నిలిపివేసినట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ లోక్‌సభలో వెల్లడించారు. నకిలీ పత్రాలతో సిమ్ కార్డులు పొంది డిజిటల్ మోసాలకు పాల్పడుతున్న వారి ఆగడాలను అరికట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని బండి సంజయ్ తెలిపారు. అంతేకాకుండా, 2,08,469 ఐఎమ్ఈఐలను కూడా ప్రభుత్వం నిలిపివేసిందని అన్నారు. ప్రతి ఫోన్‌కు కేటాయించే ప్రత్యేక సంఖ్య ఐఎమ్ఈఐ అని, డిజిటల్ అరెస్టుల కోసం వినియోగిస్తున్న 3,962 స్కైప్ ఐడీలను, 83,668 వాట్సాప్ ఖాతాలను భారత సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ గుర్తించి బ్లాక్ చేసిందని వివరించారు. 2021లో సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటైందని, దీని ద్వారా ఇప్పటివరకు 13.36 లక్షలకు పైగా ఫిర్యాదులు అందాయని, సుమారు రూ. 4,386 కోట్లు కాపాడగలిగామని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులే లక్ష్యంగా జరిగే నేరాలపై ప్రత్యేక దృష్టి సారించామని బండి సంజయ్ తెలిపారు. డిజిటల్ నేరాలకు సంబంధించి ఫిర్యాదు చేయడానికి సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (https://cybercrime.gov.in) అందుబాటులో ఉందని, దీని ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని, సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని అధికారులు చర్యలు చేపడతారని వివరించారు.





# అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి వారల కళ్యాణ మహోత్సవం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం సుప్రభాతం, గణపతి పూజ, నవగ్రహ పూజ కార్యక్రమం నిర్వహించడం నిర్వహించారు. ఉదయం 10:30కు స్వామివారి ఎదుర్కోలు కార్యక్రమం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించి, 11:30నిమిషాలకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా



కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, చింతల దామోదర్ రెడ్డి, మునుగోడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మండల, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, సుర్వి నర్సింహా గౌడ్, పాల్గొని స్వామి వార్లకు కన్యాదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధ్యక్షుడు నాగిళ్ల రామచంద్రం, ఉపాధ్యక్షులు చింతల ప్రభాకర్ రెడ్డి, ఊదరి శ్యాంసుందర్, ఉష్కాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఊదరి శంకర్, కోశాధికారి కానుగు శేఖర్ ముదిరాజ్, సహాయ కార్యదర్శి తొర్పునూరి మల్లేష్ గౌడ్, ప్రచార కార్యదర్శి తొర్పునూరి నర్సింహ్మా గౌడ్, ఆరుట్ల లింగస్వామి, సాంస్కృతిక కార్యదర్శులు ఎలుక రాజు మల్లేష్, గట్టు పవన్, కార్యవర్గ సభ్యులు ఉదరి యాదయ్య, అనంతుల నరసింహ, నకిరేకంటి శ్రీశైలం, చెవగోని మహేష్, చామకూర రాజయ్య, బడుగు పద్మ, ఉయ్యాల పల్లవి, ఎదునోజు చంద్రశేఖర్ చారి, ధర్మకర్తలు బత్తుల శ్రీశైలం గౌడ్, బోయ రామచంద్రం బడుగు మాణిక్యం పాలడుగు వెంకన్న, గుజ్జుల సురేందర్ రెడ్డి, ఊదరి మారయ్య, గౌరవ సలహాదారులు చింతల దామోదర్ రెడ్డి, చిక్క నరసింహ, నాంపల్లి శ్రీనివాస్, బాల్యం వెంకటాచలపతి, దాచపల్లి రాజు, నల్ల గణేష్, ఆలయ ప్రధాన అర్చకులు సంతోష్ కుమార్ శాస్త్రి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై
# స్పందించిన వీసీ సజ్జనార్

* **బెట్టింగ్ యాప్ బాధితులకు సజ్జనార్ విజ్ఞప్తి**
* **సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదన్న వీసీ సజ్జనార్**
* **బలవన్మరణం వద్దు... బతికి సాధించడమే ముద్దు అన్న సజ్జనార్**
* **సమస్య నుంచి ఎలా బయటపడాలో ఆలోచించాలని సూచన**
* **చనిపోవాలనే ఆలోచన రాకూడదన్న సజ్జనార్**



బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌ల బాధితులకు ఆయన ఒక విజ్ఞప్తి చేశారు. సమస్య ఏదైనా ఆత్మహత్య పరిష్కారం కాదని ఆయన అన్నారు. 'బలవన్మరణం వద్దు... బతికి సాధించడమే ముద్దు' అని బెట్టింగ్ యాప్‌ల బాధితులకు సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ బాధితులు బలవన్మరణాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. "ఆలోచించండి.. మీరు క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల వల్ల మీ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంతటి క్షోభను అనుభవిస్తారో. సమస్య వచ్చినప్పుడు దాని నుంచి ఎలా బయటపడాలో అన్వేషించాలే తప్ప.. చనిపోవాలనే ఆలోచనే రాకూడదు" అని సూచించారు. మనకు ఉన్నది ఒక్కటే జీవితమని, ఏం సాధించినా ఈ జీవితంలోనే అని పేర్కొన్నారు. జీవన ప్రయాణంలో ఒక్కసారి కిందపడితే సర్వం కోల్పోయినట్లుగా భావించవద్దని హితవు పలికారు. అమూల్యమైన జీవితాన్ని అర్ధాంతరంగా కాలదన్నుకోవద్దని విజ్ఞప్తి చేశారు. చీకటి వెలుగుల వలె నిత్యం కష్టసుఖాలు అందర్నీ వెంటాడుతూనే ఉంటాయని, కష్టకాలంలో బాధలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. తద్వారా పరిష్కార మార్గాలు వెతకాలని ఆయన అన్నారు. ఎంత కష్టం వచ్చినా ఎల్లకాలం ఉంటుందా? చనిపోయినంత మాత్రాన సమస్యలు టక్కున మాయమవుతాయా!? అని ప్రశ్నించారు.

### రూ.100 కోట్ల చిట్టీల సొమ్ముతో
# పరారైన పుల్లయ్య బెంగళూరులో అరెస్ట్

* **చిట్టీల పేరిట రూ.100 కోట్లకు టోకరా వేసిన పుల్లయ్య**
* **హైదరాబాదులో ఇల్లు ఖాళీ చేసి పరారీ**
* **దాదాపు 2 వేల మంది నుంచి చిట్టీలు వసూలు**
* **సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన బాధితులు**



గత నెలలో హైదరాబాదులో పుల్లయ్య అనే వ్యక్తి రూ.100 కోట్ల మేర చిట్టీల సొమ్ము వసూలు చేసి పరారైన సంగతి సంచలనం సృష్టించింది. దాదాపు 2 వేల మంది నుంచి అతడు చిట్టీల పేరుతో నగదు వసూలు చేసి, తిరిగి చెల్లించకుండా పారిపోవడంతో బాధితులు లబోదిబోమన్నారు. అతడిపై హైదరాబాద్ సీసీఎస్ పోలీస్ స్టేషన్ లో బాధితులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు... ఎట్టకేలకు చిట్టీల పుల్లయ్యను బెంగళూరులో అరెస్ట్ చేశారు. అతడితోపాటు రామాంజనేయులు అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ బెంగళూరు నుంచి హైదరాబాద్ తరలించారు. పుల్లయ్య స్వస్థలం అనంతపురం జిల్లా చందన లక్ష్మీపల్లి గ్రామం. హైదరాబాదులోని ఎస్సార్ నగర్ లో చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. రూ.5 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలు నిర్వహిస్తుంటాడు. మొదట్లో చెల్లింపులు సక్రమంగా జరపడంతో ఖాతాదారులు మరింత పెరిగారు. ఇదే అదనుగా, అందినకాడికి వసూలు చేసుకుని ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. 18 ఏళ్ల క్రితం నగరానికి వచ్చిన అతడు మొదట్లో అడ్డ మీద కూలీగా పనిచేశాడు. స్థానికులతో పరిచయాలు పెంచుకుని క్రమంగా చిట్టీల వ్యాపారంలో దిగాడు.

### అత్తగారింటికి, తన భూములున్న ప్రాంతానికి
# రేవంత్ రెడ్డి రోడ్డు వేసుకుంటున్నారు

* **రైతుబంధు ఇచ్చేందుకు డబ్బులు లేవని చెబుతున్నారని విమర్శ**
* **హెచ్ఎండీఏలో రూ. 20 వేల కోట్లతో టెండర్లు ఎలా పిలుస్తున్నారని ప్రశ్న**
* **రుణమాఫీపై దేవుళ్ల మీద ఒట్టేసి మోసం చేశారని విమర్శ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అత్త గారిల్లు, ఆయన భూములు ఉన్న ఆమన్‌గల్‌కు రూ. 5 వేల కోట్లతో రోడ్డు ఎలా వేస్తున్నారో చెప్పాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. రైతుబంధు ఇచ్చేందుకు డబ్బులు లేవని పదేపదే చెబుతున్నారని, కానీ హెచ్ఎండీఏలో రూ. 20 వేల కోట్లతో టెండర్లు ఎలా పిలుస్తున్నారని ఆయన నిలదీశారు. రుణమాఫీపై దేవుళ్ల మీద ఒట్టేసి ముఖ్యమంత్రి మోసం చేశారని ఆయన విమర్శించారు. అసెంబ్లీలో రుణమాఫీపై ప్రశ్నిస్తే ప్రతి దాడులు, సస్పెన్షన్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బయట ప్రశ్నిస్తే పోలీసు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రుణమాఫీ సహా వివిధ హామీలపై కాంగ్రెస్ నేతలను రైతులు ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. వడగండ్ల వాన వల్ల రైతులందరూ నష్టపోయారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 30 వేలు నష్టపరిహారం చెల్లించాలని హరీశ్



రావు డిమాండ్ చేశారు. శాసనసభను వేదిక చేసుకొని రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పదవులు రాకుంటే అసంతృప్తి సహజమే
### : కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

* **తానూ అసంతృప్తితోనే ఉన్నానన్న జీవన్ రెడ్డి**
* **మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం పచ్చజెండా**
* **ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డి వ్యాఖ్యలకు ప్రాధాన్యత**



పదవులు రాకుంటే ఎవరికైనా అసంతృప్తి కలగడం సహజమేనని, ప్రస్తుతం తాను కూడా అసంతృప్తితోనే ఉన్నానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు అధిష్ఠానం ఆమోదం తెలిపిందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నిన్న పార్టీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కే.సీ. వేణుగోపాల్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రివర్గ విస్తరణతో పాటు తాజా రాజకీయ అంశాలపై చర్చించారు.

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం వెలికితీత

అమ్రాబాద్: నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో మృతదేహాన్ని గుర్తించి.. అధికారులు వెలికితీశారు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. ఈ ఘటనలో మొత్తం 8 మంది కార్మికుల గల్లంతు కాగా.. ఇటీవల ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఆరుగురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతి చెందిన వ్యక్తి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా అధికారులు గుర్తించారు. పోస్టమార్టం తర్వాత మృతదేహాన్ని స్వస్థలానికి పంపిచేందుకు ఏర్పాట్లు చేస్తామని జిల్లా కలెక్టర్ సంతోషకుమార్ తెలిపారు.





# చిట్టి జడ... చూపు తిప్పుకోనివ్వదే!

అమ్మాయిల అందమంతా జుట్టులోనే ఉందంటే కాదనగలమా! అందుకే, దుస్తులకు తగ్గట్లు కురులకూ అలంకరణలు పెరిగాయి. అందులోనూ పెళ్లిళ్లు వంటి సందర్భాలైతే కాస్త ఆడంబరంగానూ కనిపించాలని కోరుకుంటున్నారు ఇప్పుడంతా. అలాగని వాలుజడ, పూలమాలలూ, బంగారు కుచ్చులు... అంటూ పెద్ద లిస్ట్ చెప్పేయకండి. వాటికీ ప్రాధాన్యం ఇస్తే బాగానే ఉంటుంది కానీ, ఈ తరానికి అంత ఓపిక, తీరిక లేవు. అందుకే, వారిని మెప్పించేందుకు తయారీదారులు ఈ గోల్డెన్ హెయిర్ చోటీలను మార్కెట్‌లోకి తెచ్చారు. పసిడి, రత్నాలూ, రాళ్లూ.... వంటి హంగులతో రూపొందించిన ఈ చిట్టి జడలు అమ్మాయిల మనసు దోచేసుకుంటున్నాయి. దీన్ని జుట్టు అల్లుకున్నా, విరబోసుకున్నా... సులువుగా పెట్టేసుకోవచ్చు కూడా. బరువూ తక్కువే. మరి మీరూ ప్రయత్నిస్తారా?





## పూరీ... నూనె లేకుండా!

'నీకు ఏ టిఫిన్ అంటే ఇష్ట'మని అడిగి చూడండి. చాలావరకూ పిల్లలు పూరీ అనేస్తారు. వేసవి కాలం... రాబోయేది సెలవులు. ఇంట్లో పూరీకోసం మారాం మామూలుగా ఉండదు కదా! నూనెలో వేయించినవేమో ఈ కాలం అంత మంచిది కాదు. కాబట్టి... ఇలా ప్రయత్నించండి.

**అవెన్‌లోనూ...**

పూరీ పిండిలో కాస్త ఉప్పు, నూనె, తగినన్ని నీళ్లు చేర్చి ముద్దలా కలిపి పక్కన పెట్టాలి. తరవాత చిన్న చిన్న పూరీల్లా ఒత్తుకోవాలి. వాటికి కొద్దిగా నూనె రాసి మైక్రోవేవ్ సేఫ్ ప్లేటులో ఉంచాలి. మధ్యమధ్యలో తిప్పుతూ రెండు నిమిషాలు వేడిచేస్తే సరి. బేకింగ్ పద్ధతిలోనూ చేసుకోవచ్చు. ముందుగా 200 డిగ్రీల వద్ద అవెన్‌ను ప్రీహీట్ చేయండి. తరవాత ఒత్తుకున్న పూరీలను బేకింగ్ ట్రేలో ఉంచి 8-10 నిమిషాలు బేక్ చేస్తే సరి.

**ఎయిర్ ఫ్రైయర్‌లో...**

ఎయిర్ ఫ్రైయర్‌ని 180 డిగ్రీల వద్ద ప్రీహీట్ చేయాలి. తరవాత ఒత్తుకున్న పూరీలకు రెండువైపులా నూనె లేదా నెయ్యి రాసి, ఎయిర్ ఫ్రైయర్ ట్రేలో ఉంచి 7-8 నిమిషాలు వేయిస్తే సరి. మధ్యమధ్యలో తిప్పుతూ ఉండటం మర్చిపోవద్దు. అతి తక్కువ నూనె, సమయంలో పూరీలు సిద్ధమవుతాయి. పైగా ఆరోగ్యం.

**ఆవిరితో...**

ఇడ్లీపాత్ర ప్లేటు తీసుకుని నూనె రాసి, ఒత్తుకున్న పూరీల్ని దానిపై ఉంచాలి. నీళ్లు మరిగించి, దానిలో ఇడ్లీప్లేటును ఉంచాలి. అయిదు నిమిషాలయ్యాక ఆ పూరీలను తిప్పి మరో అయిదు నిమిషాలు ఉంచి, దించాలి. ఇప్పుడు ఈ పూరీలను మందమైన ప్లేటులోకి తీసుకోవాలి. స్టవ్ మీద వెడల్పాటి గిన్నెను పెట్టి, దానిలో మరో చిన్న గిన్నెను బోర్లించి దానిపై ఈ ప్లేటు ఉంచాలి. గిన్నెను మరో మూతతో మూసి సన్నని మంట మీద పది నిమిషాలు ఉంచితే సరి. కరకరలాడే పూరీ రెడీ. పిల్లలనే కాదు... డైటింగ్‌లో ఉండి, పూరీలను తినాలనుకునేవారికీ ఇవి మంచి మార్గం... కదూ!



# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు..




**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఫ్లాట్‌గా ముగిశాయి. టారిఫ్ నుంచి పలు దేశాలకు ఊరట కల్పిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంకేతాలతో స్టాక్ మార్కెట్లు ఉదయం లాభాల్లో ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 78వేల పాయింట్లు దాటింది. ఈ క్రమంలో మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. దాంతో ఆరంభంలో వచ్చిన లాభాలన్నీ ఆవిరయ్యాయి. చివరలో స్వల్ప లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ క్రితం సెషన్‌తో పోలిస్తే 78,296.28 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 78,741.69 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. కనిష్ఠంగా 77,745.63 పాయింట్లను తాకింది.

చివరకు 32.8 పెరిగి 78,017.19 వద్ద ముగిసింది. నిఫ్టీ 10.30 పాయింట్లు పెరిగి.. 23,668.65 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో దాదాపు 1,019 షేర్లు పెరగ్గా.. 2,868 షేర్లు పతనమయ్యాయి. ఐటీ మినహా, మిగతా అన్ని రంగాల సూచీలు ఆటో, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, ఆయిల్, గ్యాస్, పవర్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, టెలికాం షేర్లు ఒకటి నుంచి 1.5శాతం పతనమయ్యాయి. అల్ట్రాటెక్ సిమెంట్, ట్రెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్ నిఫ్టీలో లాభాలను ఆర్జించాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, కోల్ ఇండియా, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.6 శాతం పతనమయ్యాయి.

# ఆపిల్ నుంచి అదిరిపోయేలా మడతపెట్టే ఫోన్..!



**న్యూఢిల్లీ:** ఆపిల్ కంపెనీ చాలాకాలంగా 4-మోడల్ ఐఫోన్ సిరీస్‌ను కొనసాగిస్తున్నది. ఈ ఏడాది నుంచి మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆపిల్ ఈ ఏడాది ఐఫోన్ 17 ఎయిర్‌ను విడుదల చేయాలని యోచిస్తున్నది. ఇది ప్లస్ వేరియంట్‌ని భర్తీ చేయనున్నది. ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తూ.. కంపెనీ 2026 కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్‌ని విడుదల చేసే అవకాశం ఉన్నది. కొత్త బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. ఆపిల్ ఈ డివైజ్ కోసం క్లామ్‌షెల్ (ఫ్లిప్) డిజైన్ కాకుండా శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్ తరహాలో బుక్ స్టయిల్ డిజైన్‌ను తీసుకురానున్నది.

నివేదిక ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ శామ్‌సంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్‌ని పోలి ఉండనున్నట్లు తెలుస్తున్నది. డిజైన్ ఐఫోన్ 17 ఎయిర్ నుంచి ప్రేరణగా తీసుకోనున్నది. ఆపిల్ త్వరలో తీసుకురానున్న ఐఫోన్ 17 ఎయిర్ అల్ట్రా సిమ్‌గా తెలుస్తున్నది. కేవలం 5.5 ఎంఎం మందం మాత్రమే ఉండనున్నట్లు తెలుస్తున్నది. దాంతో కెమెరా, స్పీకర్ క్వాలిటీలో రాజీ పడక తప్పదని నివేదిక పేర్కొంది. కానీ, బ్యాటరీ లైఫ్ ఐఫోన్ 16ఈ తరహాలోనే ఉంటుంది. ఇక ఐఫోన్ 17 ఎయిర్ వినూత్న డిజైన్‌ను ఆపిల్ భవిష్యత్ ఫోల్డబుల్ ఐఫోన్‌కు పునాదిగా భావిస్తున్నది. లీకుల ప్రకారం.. ఐఫోన్ ఫోల్డబుల్ పూర్తిగా తెరిచిన సమయంలో 7.8 ఇంచెస్ మెయిన్ డిస్‌ప్లే, 5.5 ఇంచెస్ ఎక్స్‌టర్నల్ స్క్రీన్‌తో వస్తుంది. స్ట్రాంగ్, డ్యూరబుల్‌తో ఫోన్‌ని తీసుకువచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

ఇందు కోసం లిక్విడ్ మెటల్‌ని ఉపయోగించనున్నట్లు సమాచారం. ఫోల్డబుల్ ఫోన్ ఓపెన్ చేసిన సమయంలో 4.5 ఎంఎం.. మతపెట్టిన సమయంలో 9 ఎంఎం నుంచి 9.5 ఎంఎం మందం ఉండనున్నది. ఇదే నిజమైతే ఇప్పటి వరకు ఉన్న ఫోల్డబుల్ ఫోన్‌లలో ఇదే స్లిమ్ ఫోన్‌గా మారనున్నది. ఇక ఆపిల్ ఫేస్ టచ్ ఐడీకి బదులుగా టచ్ ఐడీ సెన్సార్‌ను తీసుకురానున్నట్లు తెలుస్తున్నది. ఫోన్ క్వాలిటీని మెరుగుపరిచేందుకు టైటానియం ఛాసిస్‌ను ఉపయోగించవచ్చని తెలుస్తున్నది. దాంతో మొబైల్ తక్కువ బరువుతో ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ అందించనుంది. ఇప్పటి వరకు మొబైల్ స్పెసిఫికేషన్స్‌ను ఆపిల్ వెల్లడించలేదు. కేవలం ఇవన్నీ లీకులు మాత్రమే. ఇక ఈ మొబైల్ ధర అమెరికాలో 2,300 డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.1.91లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తున్నది.

# ఏఐ ఫీచర్లతో రియల్‌మీ పీ3 ప్రో 5జీ సేల్స్ ప్రారంభం..

రూ.2,000 వరకూ డిస్కౌంట్..!



**న్యూఢిల్లీ:** ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన రియల్‌మీ పీ3 ప్రో 5జీ ఫోన్ విక్రయాలు మంగళవారం నుంచి ప్రారంభం అయ్యాయి. గత వారం భారత్ మార్కెట్‌లో రియల్‌మీ పీ3ఎక్స్ 5జీతోపాటు రియల్‌మీ పీ3 ప్రో 5జీ ఫోన్‌ను రియల్‌మీ ఆవిష్కరించింది. రియల్‌మీ పీ3 ప్రో 5జీ ఫోన్ మూడు ర్యామ్, స్టోరేజీ వేరియంట్లలో లభిస్తుంది. ఈ ఫోన్ క్వాల్ కామ్ స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్3 ప్రాసెసర్‌పై పని చేస్తుంది. రియల్‌మీ పీ3 ప్రో 5జీ ఫోన్ 1.5కే రిజొల్యూషన్‌తోపాటు అమోలెడ్ డిస్‌ప్లే కలిగి ఉంటుంది. 50-మెగా పిక్సెల్ డ్యుయల్ కెమెరా సెటప్, 80వాట్ల ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీపై పని చేస్తుందీ ఫోన్.

రియల్‌మీ పీ3 ప్రో 5జీ ఫోన్ 8 జీబీ ర్యామ్ విత్ 128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ. 23,999తో ప్రారంభమవుతుంది. 8జీబీ ర్యామ్ విత్ 256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.24,999, 12జీబీ ర్యామ్ విత్ 256జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.26,999 పలుకుతుంది. ఈ ఫోన్ గెలాక్సీ పర్పుల్, నెబులా గ్లో, శాటర్న్ బ్రౌన్ రంగుల్లో లభిస్తుంది. రియల్‌మీ పీ3 ప్రో 5జీ ఫోన్ రియల్‌మీ యూఐ 6.0 బేస్డ్ ఆండ్రాయిడ్ 15 వర్షన్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 450పీపీఐ పిక్సెల్ డెన్సిటీతోపాటు 6.83-అంగుళాల 1.5కే (1,472ఐ2,800 పిక్సెల్స్) క్వాడ్ కర్వ్‌డ్ అమోలెడ్ స్క్రీన్ కలిగి ఉంటుంది.

రియల్‌మీ పీ3 ప్రో 5జీ ఫోన్ కంపెనీ వెబ్‌సైట్, ఈ-కామర్స్ జెయింట్ ఫ్లిప్‌కార్ట్ ద్వారా భారత్‌లో విక్రయిస్తోంది. సెలెక్టెడ్ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులపై రూ.2,000, ఎక్స్ఛేంజ్ ఆఫర్ కింద రూ.2,000 డిస్కౌంట్ అందిస్తోంది. ఆరు నెలల వరకూ నో-కాస్ట్ ఈఎంఐ ఆప్షన్ కూడా అందుబాటులో ఉంది.

రియల్‌మీ పీ3 ప్రో 5జీ సోనీ ఐఎంఎక్స్ 896 సెన్సర్‌తోపాటు 50-మెగా పిక్సెల్ ప్రైమరీ కెమెరాతోపాటు డ్యుయల్ రేర్ కెమెరా, 2-మెగా పిక్సెల్ డెప్త్ సెన్సర్ కెమెరా, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16-మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటుంది. ఈ ఫోన్ డస్ట్ అండ్ వాటర్ రెసిస్టెన్స్ కోసం ఐపీ68 ం ఐపీ69 రేటింగ్స్ కలిగి ఉంది. ఏఐ బెస్ట్ ఫేస్, ఏఐ ఎరేజ్ 2.0, ఏఐ మోషన్ డెబ్లర్, ఏఐ రీఫ్లెక్సన్ రిమూవర్ వంటి ఏఐ బేస్డ్ ఫీచర్లు ఉన్నాయి.

# పంజాబ్ ఖాతాలో తొలి విజయం

హైస్కోరు మ్యాచ్‌లో అద్భుతం చేసిన అర్ష్‌దీప్..

గుజరాత్ ఓటమి

**అహ్మదాబాద్:** ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ జట్టు బోణీ కొట్టింది. ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు జట్టును ప్రక్షాళన చేసిన పంజాబ్.. అంచనాలకు తగ్గట్లు రాణించి.. తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బ్యాటింగ్, విజయ్ వైశాఖ్ బౌలింగ్‌తో గుజరాత్ టైటాన్స్‌ను ఓడించింది. ప్రత్యర్థి భారీ లక్ష్యాన్ని నిలిపినా.. గుజరాత్ బ్యాటర్లు గొప్పగా పోరాడారు. కానీ విజయం మాత్రం అందుకోలేకపోయారు.





ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు చేసింది. పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 42 బంతుల్లో 5 ఫోర్లు, 9 సిక్సలతో 97 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. జట్టుకు భారీ స్కోరు అందించి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గుజరాత్ టైటాన్స్ బౌలర్లలో సాయి కిషోర్ 3 వికెట్లు తీయగా.. కగిసో రబాడా 1, రషీద్ ఖాన్ 1 వికెట్ పడగొట్టారు.

అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్.. 232/5 పరుగులకు పరిమితం అయింది. చేతిలో వికెట్లు ఉన్నా.. వేగంగా ఆడలేక మ్యాచ్‌ను కోల్పోయింది. ఓ దశలో పంజాబ్ కింగ్స్‌కు టఫ్ ఫైట్ ఇచ్చిన గుజరాత్.. చివరి వరకూ ఆ జోష్‌ను కొనసాగించలేకపోయింది.

244 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగిన గుజరాత్.. 16 ఓవర్లు ముగిసే సరికి.. 182/2తో నిలిచింది. క్రీజులో జోస్ బట్లర్ ఉండటం.. ఇంకా రాహుల్ తెవాటియా, షారుఖ్ ఖాన్, రషీద్ ఖాన్ లాంటి ప్లేయర్లు క్రీజులోకి రావాల్సి ఉండటంతో ఆ జట్టు గట్టి పోటీ ఇచ్చేలా కనిపించింది. కానీ ఈ దశలో పంజాబ్ బౌలర్లు పుంజుకున్నారు. ముఖ్యంగా గతేడాది వరకూ ఆర్సీబీకి ఆడిన విజయ్ కుమార్ వైశాఖ్ సత్తాచాటాడు. తొలి రెండు ఓవర్లలో కేవలం 10 రన్స్ మాత్రమే ఇచ్చి.. జట్టుకు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ మ్యాచ్ విజయంతో పంజాబ్ కింగ్స్.. ఐపీఎల్ 2025లో బోణీ కొట్టింది.

# ఐసీయూలో అమ్మ.. ఐపీఎల్ ప్రదర్శన రద్దు చేసుకున్న నటి..!

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌లో భారీ స్కోరింగ్ మ్యాచ్‌లు, ఉత్కంఠ పోరాటాలు ఫ్యాన్స్‌ను అలరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో థ్రిల్లింగ్ మ్యాచ్‌లను కళ్లారా చూసేందుకు స్టేడియాలకు అభిమానులు పోటెత్తుతున్నారు. వేలకు వేలు పెట్టి టికెట్లు కొని.. మైదానంలో వాలిపోతున్నారు ఫ్యాన్స్. అందుకే వీళ్లను ఎంటర్‌టైన్ చేసేందుకు భారత క్రికెట్ బోర్డు సినీ తారలతో ప్రదర్శనలు ఇప్పిస్తోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండేజ్‌కు బంపర్ ఆఫర్ వచ్చింది. అయితే.. అనారోగ్యంతో బాధపడుతున్న అమ్మను చూసుకునేందుకు నటి తన ఫెర్మార్మెన్స్‌ను రద్దు చేసుకుందని సమాచారం.



గువాహటి వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ మార్చి 26, బుధవారం తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు జాక్వెలిన్ ఫెర్నాండేజ్ ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. కానీ, ఆమె తల్లి కిమ్ అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యారు. ముంబైలోని లీలావతి హాస్పిటల్లో చేరిన ఆమెకు ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నారు వైద్యులు.

దాంతో, తన కెరియర్ ఆసాంతం వెన్నుతట్టి ప్రోత్సహించిన అమ్మను దగ్గర ఉండి చూసుకోవాలనుకుంది జాక్వెలిన్. ఈ విషయాన్ని ఐపీఎల్ నిర్వాహకులకు తెలియజేసిన అందాల తార.. తాను గువాహతిలో స్టేజ్ షోకు అందుబాటులో ఉండనని వెల్లడించింది.

# తొలి మ్యాచ్‌లోనే గోల్డెన్ డక్..




మ్యాక్సీ ఖాతాలో చెత్త రికార్డు

**అహ్మదాబాద్:** ఆస్ట్రేలియా ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ విధ్వంసక ఇన్నింగ్స్‌లకు పెట్టింది పేరు. అతడు క్రీజులో ఉన్నాడంటే బౌలర్లకు వణుకే. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో చిరస్మరణీయ ప్రదర్శనలు చేసిన ఈ ఆసీస్ బ్యాటర్ ఐపీఎల్లో మాత్రం చెత్త రికార్డు మూటగట్టుకున్నాడు. 18వ ఎడిషన్‌లో పంజాబ్ కింగ్స్ తరపున ఆడుతున్న మ్యాక్సీ.. 18వ సీజన్ తొలి మ్యాచ్‌లో సున్నాకే వెనుదిరిగాడు. అది కూడా ఎదుర్కొన్న మొదటి బంతికే ఎల్బీగా ఔటయ్యాడు. తద్వారా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు గోల్డెన్ డక్ అయిన బ్యాటర్‌గా నిలిచాడీ ఆల్‌రౌండర్.

అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో గుజరాత్ టైటన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మ్యాక్స్‌వెల్ గోల్డెన్ డకట్ అయ్యాడు. సాయికిశోర్ బౌలింగ్‌లో అజ్మతుల్లా ఓమర్జాయ్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన మ్యాక్సీ.. తొలి బంతికే ఎల్బీగా పెవిలియన్ చేరాడు. దాంతో, ఐపీఎల్‌లో 19సార్లు మొదటి బంతికే సున్నా చుట్టేసిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు.

# నేలమట్టం కానున్న 130 ఏళ్ల స్టేడియం..

ఒలింపిక్స్ పోటీలే ఆఖరు..!

**గబ్బా:** ఆస్ట్రేలియాలోని ప్రధాన స్టేడియాల్లో ఒకటైన గబ్బా అంటే చాలు క్రికెట్ జట్లు వణికిపోతాయి. ఆ మైదానం ఆసీస్‌కు కంచుకోట లాంటిది. అక్కడ కంగారులను ఓడించిన జట్లు కొన్నే. నాలుగేళ్ల క్రితం టీమిండియా సంచలన విజయంతో చరిత్రను తిరగరాసింది. అలాంటి గబ్బా మైదానం త్వరలోనే నేలమట్టం కానుంది. స్వదేశంలో జరుగనున్న 2032 ఒలింపిక్స్ అనంతరం గబ్బాను కూల్చివేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విషయాన్ని మంగళవారం క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం వెల్లడించింది.

క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం గబ్బా స్టేడియాన్ని 1895లో నిర్మించింది. అప్పట్నుంచీ ఈ మైదానం దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తూ వస్తోంది. దాదాపు 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ స్టేడియం నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దాంతో, స్టేడియం కొంత భాగం శిథిలావస్థలో ఉంది. ఆటగాళ్ల భద్రత, స్టేడియం పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కూల్చివేయడమే పరిష్కారమని అధికారులు అనుకుంటున్నారు. 2032లో ఒలింపిక్స్ పోటీల తర్వాత.. గబ్బా కనుమరుగు కానుంది. ఆ తర్వాత నుంచి జరగాల్సిన క్రికెట్ మ్యాచ్‌లు విక్టోరియా పార్క్ ప్రాంతంలోని మైదానంలో జరుగనున్నాయి. విశ్వ క్రీడల కోసం 63 వేల సీట్ల సామర్థ్యంతో అక్కడ కొత్త మైదానం నిర్మిస్తున్నారు.



### బంగారు పతకం గెలుపొంది

'విక్టోరియాలో కొత్త మైదానం నిర్మిస్తున్నాం. 63 వేల మంది సామర్థ్యంతో రూపొందుతున్న ఈ స్టేడియంలో సకల సౌకర్యాలు కల్పిస్తాం. 2032 తర్వాత గబ్బాలో జరగాల్సిన మ్యాచ్‌లను విక్టోరియా పార్క్‌లోని స్టేడియంలో నిర్వహిస్తాం. విశ్వక్రీడల్లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు బంగారు పతకం గెలుపొంది.. గబ్బాకు వీడ్కోలు పలకాలని ఆశిస్తున్నాం. కొత్త స్టేడియం నిర్మాణానికి ముందుకొచ్చిన క్వీన్స్‌లాండ్ ప్రభుత్వానికి క్రీడాభిమానులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా ఓ ప్రకటనలో వెల్లడించింది.

# క్రేజీ ఫోటోలను షేర్ చేసిన షాలిని



**టాకీస్:** షాలిని పాండే తెలుగు, తమిళం, హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ బ్యూటీ 1993 సెప్టెంబర్ 23న మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జన్మించింది. జబల్‌పూర్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి ఇంజనీరింగ్ పూర్తి చేసిన షాలిని, చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తితో సినిమాల్లోకి వచ్చింది. ఇంజనీరింగ్ చదువుతున్న రెండవ సంవత్సరం నుంచే ఆమె నాటకాల్లో నటించడం ప్రారంభించింది. షాలిని పాండే 2017లో విజయ్ దేవరకొండ నటించిన తెలుగు చిత్రం అర్జున్ రెడ్డి ద్వారా సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఈ చిత్రంలో ఆమె ప్రీతి అనే పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఈ సినిమా భారీ విజయం సాధించడంతో షాలినికి విశేష గుర్తింపు లభించింది. తెలుగు మాట్లాడడం రానప్పటికీ, ఈ చిత్రంలో తన పాత్రకు ఆమె స్వయంగా డబ్బింగ్ చెప్పుకుంది. అర్జున్ రెడ్డి తర్వాత షాలిని తెలుగులో మహానటి, 118, ఇద్దరి లోకం ఒకటే, నిశ్శబ్దం వంటి చిత్రాల్లో నటించింది. ఆమె తమిళ సినిమా 100% కాదల్ లో కూడా కనిపించింది. హిందీలో జయేష్‌భాయ్ జోర్దార్, మహారాజ్ చిత్రాలతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. మహారాజ్ చిత్రంలో ఆమె నటన, ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాల్లో ఆమె నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే షాలిని. రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ కొన్ని క్రేజీ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.

# ఆ హీరోతో నటించడం ఎంతో అదృష్టం: మాళవిక



**టాకీస్:** తమిళంలో అగ్ర హీరోల సరసన నటించి ప్రతిభావంతురాలైన నటిగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ సందర్భంగా ప్రభాస్ మంచితనం, సహృదయతకు తాను ఫిదా అయిపోయానని, ముఖ్యంగా ఆయన ఇంటి నుంచి తీసుకొచ్చే ఫుడ్ అద్భుతమని గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్‌ను పొగడ్తల్లో ముంచెత్తిందీ భామ. తాజాగా మరోసారి ప్రభాస్ గురించి మాట్లాడింది. ప్రభాస్ వంటి గ్రేట్ పర్సన్‌తో నటించడం తన అదృష్టమని, తన కెరీర్‌లోనే మైలురాయిలా నిలిచే చిత్రమవుతుందని ఆమె ఆనందం వ్యక్తం చేసింది. 'నిజంగా ఈ సినిమా ఛాన్స్ రావడం లక్కీగా ఫీలవుతున్నా. షూటింగ్ అంతా సరదాగా సాగిపోతున్నది. ప్రభాస్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడానికి మించిన ఆనందం ఏముంటుంది? ఈ సినిమాను జీవితాంతం గుర్తుంచుకుంటా' అని ఆనందం వ్యక్తం చేసింది మాళవిక మోహనన్. హారర్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన 'రాజా సాబ్' ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# మత్తు కళ్లలో మతిపోగొడుతున్న శ్రియరెడ్డి

**టాకీస్:** శ్రియ రెడ్డి.. టెలివిజన్ ప్రెజెంటర్, వీడియో జాకీగా చేసి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ అమ్మడు ఎక్కువగా తమిళం, తెలుగు సినిమాల్లో నటించింది. అంతే కాదు మాజీ భారత టెస్ట్ క్రికెటర్ భరత్ రెడ్డి కుమార్తె ఆమె . శ్రియ తన నటనా జీవితాన్ని ప్రారంభించే వీడియో జాకీగా పనిచేసింది. ఈ బ్యూటీ 2002లో "సమురాయ్" అనే తమిళ చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత తమిళం, తెలుగు, మలయాళ చిత్రాల్లో సుమారు డజను సినిమాల్లో నటించింది. "బ్లాక్" , "తిమిరు", "కంచివరం", "సలార్: పార్ట్ 1 సీజ్‌ఫైర్" లాంటి సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక తెలుగులో ఈ భామ మొ దటి చిత్రం "అప్పుడప్పుడు". ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆతర్వాత "బ్లాక్" చిత్రంలో మమ్ముట్టితో కలిసి నటించడం ద్వారా మలయాళంలో మంచి గుర్తింపు పొందింది. శ్రియ 2008లో నటుడు మరియు నిర్మాత విక్రమ్ కృష్ణను వివాహం చేసుకుంది. విక్రమ్ కృష్ణ ప్రముఖ నిర్మాత రెడ్డి కుమారుడు. అలాగే నటుడు విశాల్ కృష్ణ సోదరుడు. వివాహం తర్వాత ఆమె తన భర్తతో కలిసి సినిమా నిర్మాణంలోకి కూడా అడుగుపెట్టింది. ఇటీవల "సలార్" చిత్రంలో రాధా రామ పాత్రలో ఆమె నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. ఆమె తదుపరి పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ చిత్రంలో కూడా కనిపించనుంది. తాజాగా సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలు షేర్ చేసింది ఈ బ్యూటీ.



# నితిన్ సినిమాలో డేవిడ్‌వార్నర్

## వార్నర్‌కు తెలుగు క్లాసులు చెప్పిన శ్రీలీల

**టాకీస్:** ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు తెలుగు క్లాసులు తీసుకున్నారు నటులు నితిన్, శ్రీలీల. వీరిద్దరు జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మువీ మేకర్స్ నిర్మిస్తుంది. వెన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్, డేవిడ్ వార్నర్, తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం



మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకను ఇటీవల హైదారాబాద్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు క్రికెటర్ డేవిడ్ వార్నర్ ముఖ్య అతిథిగా వచ్చి సినిమా విజయవంతం కావాలని కోరుకోవడంతో పాటు తెలుగులో మాట్లాడి అందరిని అలరించారు. అయితే డేవిడ్ తెలుగులో మాట్లాడటానికి నితిన్, శ్రీలీల ఏ విధంగా సాయం చేశారో చూపిస్తూ.. ఒక ఫన్నీ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. తెలుగు నేర్చుకుంటున్న డేవిడ్ వీడియోను మీరు చూసేయండి.

# పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన అమీజాక్సన్

**టాకీస్:** బాలీవుడ్ నటి అమీ జాక్సన్ మరోసారి తల్లైంది. పండండి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని అమీ జాక్సన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. బాబుకు ఆస్కార్ అలెగ్జాండర్ వెస్ట్‌విక్ అని పేరు పెట్టినట్లు తెలిపింది. ఈ మేరకు భర్త, బిడ్డతో దిగిన ఫొటోను పంచుకుంది.



ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. ఇది చూసిన నెటిజన్లు, అభిమానులు అమీ జాక్సన్ జంటకు కంగ్రాట్స్ చెబుతూ పోస్టులు పెడుతన్నారు. కాగా, అమీ జాక్సన్ సినిమాల్లోకి వచ్చే ముందు మోడల్‌గా రాణించింది. 2010లో తమిళంలో 'మద్రాసపట్టణం' మూవీతో చిత్రపరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత బాలీవుడ్‌లో ప్రతీక్ బబ్బర్ సరసన 'ఏక్ దీవానా థా'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. 2014లో తెలుగులో గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ నటించిన 'ఎవడు' చిత్రంలో నటించింది. ఆ తర్వాత 2018లో సూపర్‌స్టార్ రజనీకాంత్ రోబో 2. చిత్రంతో మరింత గుర్తింపు తెచ్చుకుంది. అలాగే చియాన్ విక్రమ్ 'ఐ'మూవీలోనూ మెరిసింది. ప్రస్తుతం అమ్మడు తెలుగు సినిమాలకు దూరమైంది. గతేడాది ఆగస్టులో తన ప్రియుడు, హాలీవుడ్ నటుడు ఎడ్ విస్ట్‌విక్‌ను రెండో వివాహం చేసుకుంది. దక్షిణ ఇటలీలోని 16వ శతాబ్దం నాటి కాస్టెల్లో రోకో కోటలో ఆమె ఎడ్ వెస్ట్‌విక్‌ను మనువాడింది. అమీజాక్సన్ గతంలో జార్జ్ పనయోట్టు అనే బిజినెస్‌మెన్‌తో ప్రయాణం నడిపి.. 2019లో ఎంగేజ్‌మెంట్ చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత పెళ్లి కాకుండానే ఓ బిడ్డకు జన్మనించింది. వీరి ప్రేమ ఎక్కువ కాలం నిలువలేదు. చివరకు 2022లో పనయోట్టుతో తనబంధం ముగిసిందని ప్రకటించింది. అప్పటి నుంచి కుమారుడు ఆండ్రెస్‌తో ఒంటరిగానే ఉంటూ వచ్చింది. ఆ తర్వాత అమీ జాక్సన్ హాలీవుడ్ స్టార్ వెస్ట్‌విక్‌తో ప్రేమలో పడింది.

# సింగర్ దామినిపై నెటిజన్ సీరియస్..

## తెలుగు గాయకుల పరువు తీస్తున్నావ్..



**టాకీస్:** తెలుగు ప్రజలకు సుపరిచితమైన సింగర్ దామిని. బిగ్ బాస్ సీజన్ 7 ద్వారా మరింత పాపులర్ అయ్యింది. హౌస్ లో ఉన్నది తక్కువ రోజులే అయిన తన ఆట తీరుతో ఫేమస్ అయ్యింది. కానీ ఈ షో ద్వారా ఒకింత నెగిటివిటీని మూటగట్టుకుంది. ముఖ్యంగా హౌస్ లో ఆమె డ్రెస్సింగ్ పై విమర్శలు వచ్చాయి. అలాగే ఎక్కువ సమయం వంటగదిలో గడపడంతో వంటలక్క అనే బిరుదు కూడా ఇచ్చేశారు. హౌస్ లో అటు పాజిటివ్.. ఇటు నెగిటివిటీ రెండింటీని సంపాదించుకున్న దామిని.. తక్కువ సమయంలోనే బయటకు వచ్చేసింది. ఎలిమినేట్ అయిన తర్వాత తన పై వచ్చిన ట్రోల్స్ కు గట్టిగానే కౌంటరిచ్చింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటుంది. తన ప్రైవేట్ సాంగ్స్, ఆల్బమ్స్ చేస్తూ బిజీగా ఉన్న దామిని.. తాజాగా తన ఇన్ స్టాలో ఓ క్రేజీ ఫోటోషూట్ షేర్ చేసింది. అందులో హార్మోనియం పెట్టె పెట్టుకుని చీరలో మరింత అందంగా ఫోటోలకు ఫోజులిచ్చింది. ఈ పిక్స్ నెట్టింట వైరలవుతుండగా.. కొందరు నెటిజన్స్ ఆమె తీరుపై సీరియస్ అవుతూ కామెంట్స్ చేశారు. తెలుగు గాయకుల పరువు తీస్తున్నావ్ అంటూ ఓ నెటిజన్ కామెంట్ చేయగా.. అందుకు తన స్టైల్లో రిప్లై ఇచ్చింది దామిని. వాళ్లేం అనలేదు.. నువ్వే అంటున్నావ్.. తెలుగు గాయకులంతా బానే ఉన్నారు అంటూ స్ట్రాంగ్ రిప్లై ఇచ్చింది. తెలుగులో అనేక సినిమాల్లో సూపర్ హిట్ సాంగ్స్ ఆలపించింది దామిని. అలాగే పలు ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా చేసింది. బాహుబలి సినిమా పచ్చబొట్టేసినా పాటతో ఆమె పాన్ ఇండియా లెవల్లో క్రేజ్ వచ్చింది. రాజమండ్రికి చెందిన దామిని.. చిన్నప్పటి నుంచే శాస్త్రీయ సంగీతం నెర్చుకుంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.